క్లుప్తంగా

డీసీసీబీ చైర్మన్ పరామర్శ

చండ్రుగొండ: బీఆర్ఎస్‌పార్టీ సీనియర్ నాయకుడు సారేపల్లి శేఖర్‌ను డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం సోమవారం పరామర్శించారు. శేఖర్ సతీమణి నాగశిరోమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నాగభూషణంతోపాటు పరామర్శించిన వారిలో సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య, ఎంపీపీ బాణోత్ పార్వతి, వైస్‌ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, సొసైటీ చైర్మన్‌లు చెవుల చందర్‌రావు, గాదె లింగయ్య, సత్తి నాగేశ్వరరావు ఉన్నారు.

ములకలపల్లి ఎస్సై బాధ్యతల స్వీకరణ

ములకలపల్లి: ములకలపల్లి పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్స్‌స్పెక్టర్‌గా బి.సాయి కిషోర్‌రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన బాల్దె సురేశ్ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా అశ్వాపురం పీఎస్‌కు ట్రాన్స్‌ఫర్ అయిన విషయం విదితమే. కాగా అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో అటాచ్డ్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సాయి కిషోర్‌రెడ్డి ములకలపల్లికి వచ్చారు.

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో బాధితులను పరీక్షిస్తున్న వైద్యురాలు

దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెం గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సోమవారం నాగుపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో అంకంపాలెం గ్రామపంచాయతీ కార్యాలయంలో దీనిని ఏర్పాటు చేశారు. శిబిరంలో మొత్తం 134 మంది రోగులను డాక్టర్ శోభారాణి పరీక్షించారు. రోగ నిర్ధారణ అయిన వారికి తగు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. బాధితుల్లో నలుగురికి పక్షవాతం లక్షణాలు ఉన్నట్టుగా గుర్తించి, వారిని వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాక అనూష, సెక్రటరీ రవి, ఫార్మసిస్టు రామకృష్ణ, ఏఎన్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

గుండాల: ఆళ్లపల్లి మండల కేంద్రంలో నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యత లోపించిందని తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, గ్రామస్తులు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని భగత్‌సింగ్ సెంటర్ నుంచి బందెలదొడ్డి వరకు నిర్మించిన రోడ్డుపై కంకర తేలిందని,గుంతలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. అంతేకాకుండా ఇరువైపులా మట్టి పోయలేదని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు, నాణ్యత అధికారులు పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తిరిగి రోడ్డుపై మరమ్మతులు చేపట్టాలని, మట్టి రోడ్డుకు ఇరువైపులా పోసి అప్పగించాలని డిమాండ్ చేశారు.

చేతిపంపు ఏర్పాటు



చేతిపంపును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామంలోని ముత్యాలమ్మ గుడి వద్ద గ్రామానికి చెందిన కైపు నల్లపిచ్చిరెడ్డి జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు చేతిపంపును ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద చేతిపంపు లేకపోవటంతో భక్తుల ఇబ్బందులను గుర్తించిన నల్ల పిచ్చిరెడ్డి కుటుంబసభ్యులు చేతిపంపు ఏర్పాటుకు ముందుకు వచ్చారు. రూ.80వేలు ఖర్చుతో ఏర్పాటు చేసిన చేతిపంపును సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కైపు కొండమ్మ, సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, ఉపసర్పంచ్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, మూల వెంకట్రామిరెడ్డి, బిజ్జం వెంకట్రావిరెడ్డి, మూల లక్ష్మీరెడ్డి, వేముల సురేష్, పుట్టి రాజేష్, మూరం బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలి

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో సీనియారిటీ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు పర్మినెంట్ చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఏళ్ల తరబడి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల సీనియారిటీని పరిగణనలోకి తీసుకోకుండా పరీక్షల నిర్వహణ పేరుతో అడ్డదారులలో అనర్హులకు పర్మినెంట్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికుల శ్రమదోపిడీతో పరిశ్రమ లాభాలను ఆర్జిస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు.

అప్పుడే మండుతున్న ఎండలు

- పల్లెల్లో పనులకు అడ్డంకులు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- విద్యార్థులకూ తప్పని తిప్పలు



ఎండలోనే ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు



ఎండల తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

బూర్గంపాడు: ఫిబ్రవరి నెలలోనే ఎండలు మండిపోతున్నాయి. గత ఐదురోజులుగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. సోమవారం పినపాక నియోజకవర్గంలోని మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లో 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేడిగాలులతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉక్కపోత, ఎండతీవ్రతలకు జనం బయటకు వచ్చేందుకు కూడా భయపడుతున్నారు. వారం క్రితం వరకు రాత్రివేళల్లో చలిగా ఉన్నటువంటి వాతావరణం ఒక్కసారిగా వేడెక్కటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉక్కపోత, వేడిగాలులతో వాతావరణంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. బయటకు వెళ్లాలంటే తప్పకుండా గొడుగులు, కండువాలు తీసుకువెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. పొలం పనులకు వెళ్లిన కూలీలు ఎండతీవ్రతకు ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు ఎండతీవ్రతకు అస్వస్థతకు గురవుతున్నారు. మిర్చికోతలకు, పత్తితీతలకు వెళ్లే కూలీలు కూలి సమయాన్ని మార్చుకుంటున్నారు. వరి మాగాణులలో వ్యవసాయ పనులకు వెళ్లేందుకు కూలీలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే పనిచేస్తున్నారు. ఎండల తీవ్రత పెరుగుతుండటంతో భూగర్భజలాలు కూడా అడుగంటుతున్నాయి. ఎండల తీవ్రత కారణంగా భూగర్భజలాలు పడిపోతే రబీలో సాగుచేసిన పంటలు నష్టపోయే పరిస్థితులున్నాయి. గోదావరిలో నీరు రోజురోజుకు తగ్గిపోతుంది. అదేవిధంగా వాగులు, వంకలు పూర్తిగా ఎండిపోయే పరిస్థితులున్నాయి. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా ఎండల తీవ్రతకు ఇబ్బందులు పడుతున్నారు.మధ్యాహ్నం సమయంలో తాగునీరు వేడెక్కటంతో దాహం తీరే పరిస్థితులు లేవు. రోడ్లవెంబడి చిరువ్యాపారాలు చేసుకునేవారిపై ఎండల ప్రభావం తీవ్రంగా ఉంది. చెట్ల కింద, గొడుగు నీడలలో వ్యాపారాలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఎండల తీవ్రతతో వ్యాపారాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఒక్కసారిగా ఎండల తీవ్రత పెరగటంతో అనారోగ్య పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. మారిన వాతావరణంతో జ్వరాలు, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరేచనాలతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఎండలలో బయటకు వెళ్లే వాళ్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పనుల నిమిత్తం బయటకు వెళ్లేటప్పుడు నీళ్లబాటిల్, గొడుగు, టవల్స్, కాళ్లకు చెప్పులు తప్పకుండా తీసుకువెళ్లాలని వైద్యులు చెబుతున్నారు. రోగులు, వృద్ధులు, చిన్నారులు తప్పనిసరి పనులుంటేనే బయటకు వెళ్లాలని వారు సూచిస్తున్నారు.

పొలం పనులకు వెళ్లలేకపోతున్నాం..



ఎండలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. పొలం పనులకు వెళ్లాలంటే భయమేస్తోంది. ఉదయం 7గంటలకు వెళ్లి మధ్యాహ్నం 1గంట వరకు మాత్రమే పనులు చేస్తున్నాం. ఎండలకు చాలామంది అనారోగ్యానికి గురవుతున్నారు. ఇప్పుడే ఇట్లుంటే మే నెలలో ఎట్లుంటదో.

– బేసు కాంత, వ్యవసాయ కూలీ, బూర్గంపాడు

దాహం తీరడం లేదు..



వారం రోజుల నుంచి ఎండలు మండిపోతున్నాయి. చేల పనికి వెళితే ఉదయం 10 గంటలకే నీళ్లు వేడెక్కుతున్నాయి. వేడి నీళ్లు తాగితే దాహం తీరటం లేదు. ఎండలకు ఒకరోజు పనికి వెళితే రెండ్రోజులు ఇళ్లలోనే ఉంటున్నాం. ఇప్పుడే ఇంత ఎండలుంటే ఇంకా మూడు నెలలు ఎండల ఎంత తీవ్రంగా ఉంటాయోనని భయమేస్తుంది.

– నీరుడు లలిత, వ్యవసాయ కూలీ, బూర్గంపాడు

మోతెగడ్డ జాతర ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సైలు

బూర్గంపాడు: ఈ నెల 18న జరగనున్న మోతెగడ్డ వీరభద్రస్వామి కల్యాణ జాతర ఏర్పాట్లను సోమవారం పోలీసు అధికారులు పరిశీలించారు. పాల్వంచ సీఐ నాగరాజు, బూర్గంపాడు ఎస్ఐ సంతోష్‌లు గోదావరి నదిలో ఉన్న మోతెగడ్డకు వెళ్లి జాతరకు శాఖపరంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. మోతె గ్రామం నుంచి జాతరకు వచ్చే భక్తుల కోసం మర పడవలు ఏర్పాటు, నదిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆలయ కమిటీ ప్రతినిధులతో మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, ఆలయకమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

మణుగూరురూరల్: పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సతీమణి రేగా సుధారాణి మండలంలోని కూనవరం గ్రామపంచాయతీలో సోమవారం పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. కూనవరం గ్రామానికి చెందిన మిడిదొడ్డి సైదులు కుమారుడు భార్గవ్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆమె.. వారి నివాసానికి వెళ్లి భార్గవ్‌ను, కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఎనిక అనసూర్య అనే వృద్ధురాలిని పరామర్శించి రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు హైదరాబాద్ ఆస్పత్రిలో ట్రస్ట్ ద్వారా మెరుగైన వైద్యం అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఇటీవల నూతనంగా గృహప్రవేశం చేసిన ఎంపీటీసీ తాటి సరిత గృహాన్ని సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో కరకగూడెం ఎంపీపీ రేగా కాళిక, సర్పంచ్ ఏనిక ప్రసాద్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు వీరన్నబాబు, రామారావు, సురేష్, హర్షనాయుడు,నాగేశ్వరరావు, అర్జున్‌రావు, తక్షణ్‌రావు, రవి తదితరులు పాల్గొన్నారు.



మోరంపల్లిబంజరలో వృద్ధురాలిని పరామర్శిస్తున్న సుధారాణి, జెడ్పీటీసీ శ్రీలత

బూర్గంపాడు: ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలను ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సతీమణి సుధారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత సోమవారం పరామర్శించారు. ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన పలు కుటుంబాలను పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మోరంపల్లిబంజర, నాగినేనిప్రోలు, సారపాకలలో జరిగిన కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

భద్రాచలంటౌన్: క్రికెట్‌లో అత్యుత్తమ ప్రతిభచాటుతున్న ఇద్దరు చిన్నారి సోదరులకు ఓ విశ్రాంత ఉద్యోగి సోమవారం ఆర్థిక సహాయం చేశారు. పట్టణంలోని జిమ్ శిక్షకుడు నాగరాజు ఇద్దరు కుమారులు విద్యాన్, హరిష్‌లు అండర్ 19 విభాగంలో ప్రతిభ చాటారు. వీరి ప్రతిభను గుర్తించిన పట్టణంలోని విశ్రాంత ఐటీసీ ఉద్యోగి నిమ్మల రమణరావ్, పద్మావతి దంపతులు రూ.50 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఐటీసీలో స్పోర్ట్స్ కమిటీ సెక్రెటరీగా విధులు నిర్వహించిన రమణరావుకి ప్రతిభ ఉన్న చిన్నారి క్రీడాకారులను ప్రోత్సహిస్తుంటారు. ఈ క్రమంలోనే చిన్నారుకుల ఆర్థిక సహాయం చేసి వారు భవిష్యత్తులో భారత్ తరుపున అండర్ 19 ప్రపంచ కప్‌లో ఆడి దేశానికి వన్నె తెవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గాదె మాధవరెడ్డి, చింతల వినోద్‌కుమార్, సుబ్రహ్మణ్యం, భరతాచారి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1966-1969 వరకు కలిసి చదివిన పూర్వ విద్యార్థులు..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం కలుసుకుని సందడి చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1966–1969 వరకు కలిసి చదివిన విద్యార్థులు ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా నూతనంగా ప్రారంభించిన శ్రీముత్యాలమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో కలుసుకుని ద్వితీయ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకుని ఆపాత మధురాలను జ్ఞాపిక చేసుకున్నారు. దాదాపు 22 మంది విద్యార్థులు కలుసుకుని వారి జీవిత విశేషాలను అడిగి తెలుసుకున్నారు ఎస్‌వి సత్యనారాయణరెడ్డి, కిలిమి ఈశ్వరరెడ్డి, ఎంవీవీ రమణారెడ్డి, అప్పారావు, ఆంజనేయులు, నాగేశ్వరావు, భూషణరావు, బైరెడ్డి సూర్యనారాయణ, కుమార్, హేమలత, జ్యోతి, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో సరఫరాలో నేడు అంతరాయం ఏర్పడనుందని అందువల్లన 30 నిమిషాల పాటు తాగు నీటి సరఫరా జరుగుతుందని మిషన్ భగీరథ డీఈ ఎన్.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాగునీటి శుద్ధి కేంద్రం శుభ్ర పరచడంతో పాటు గోదావరి ఇన్‌వెల్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా తాగు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మరల ఈ నెల 15 నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా జరుగుతుందని తెలిపారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా హెల్త్‌కార్డ్ కలిగిన వారికి వరంగల్ శరత మ్యాక్సీవిజన్ ఐ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని వరంగల్ తరలించి ఉచితంగా చేయడం జరుగుతుందని వైద్యులు ప్రవీణ్ తెలిపారు. వైద్యులు ఆమోగ్, బందు వెంకటేశ్వర్లు ప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం

అశ్వాపురం: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి మాస్టర్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన మోర్సినేని చంద్రకళను అశ్వాపురంలో సోమవారం ఎంపీపీ ముత్తినేని సుజాత ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య జన్మదిన వేడుకలు నిర్వహించారు. జిల్లా, మండల కోఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దీన్, ఎస్‌కే.ఖదీర్, ఎంపీటీసీ కమటం నరేష్, నాయకులు ముత్తినేని వాసు, వేములపల్లి రమేష్, ఓరుగంటి రమేష్, ఎక్కటి పున్నారెడ్డి, సత్యనారాయణరెడ్డి, తుళ్లూరి వీరన్న, రమేష్, బొబ్బాల నాగేశ్వరరావు, పాడియం అనిల్, నర్రా సంపత్, పాయం సర్వేశ్వరరావు, మురళీకృష్ణ, పర్వత నరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి ఇఫ్టూ వినతి

మణుగూరురూరల్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మణుగూరుకు వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్కలకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ అనుబంధ జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్డీ నాసర్‌పాషా మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో గనులలో వివిధ విభాగాల్లో సుమారు 18 వేల పైచిలుకు కాంట్రాక్ట్ కార్మికులు ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్నారన్నారు. చాలిచాలనీ వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడానికి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మంగీలాల్, నాగార్జున, సాయికుమార్, శివరామకృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ తోటల సందర్శన

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని అచ్యుతాపురం, అశ్వారావుపేటలో సోమవారం రాష్ట్ర మంత్రి హరీష్‌రావు సొంత నియోజకవర్గం సిద్దిపేటకు చెందిన పలువురు రైతులు పామాయిల్ క్షేత్రాలు, ఫ్యాక్టరీలను సందర్శించారు. సిద్దిపేట, నారాయణపేట, కోదండరావుపల్లికి చెందిన 40 మంది ఔత్సాహిక రైతుల బృందం తరలిరాగా.. వీరంతా అశ్వారావుపేట మండలంలోని అచ్యుతాపురం గ్రామ సమీపంలోని రాచూరి నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావుల పామాయిల్ తోటలను పరిశీలించారు. రైతులంతా నేరుగా పంట సాగు చేసే పద్ధతులతోపాటు, పాటించాల్సిన జాగ్రత్తలు, దిగుబడులు, తోటల్లో సాగు చేసే అంతర్ పంటలు, డ్రిప్ పద్ధతులు, ఎరువుల వినియోగం, సాగు ఖర్చు, ఆదాయం, యాజమాన్యం పద్ధతుల గురించి స్థానిక అధికారులు రైతులకు వివరించారు. అనంతరం స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించి, ఫ్యాక్టరీలో గెలల దిగుమతి, క్రషింగ్ గురించి సమగ్రంగా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ డీఓ ఆకుల బాలకృష్ణ, ఆయిల్‌ఫెడ్ ఎఫ్‌వో హరీష్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ రాధాకృష్ణ, రైతులు ఉన్నారు.



పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించిన సిద్దిపేట రైతులు

కేంద్ర పథకాలపై ప్రచారం



కమలాపురంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న బీజేపీ నాయకులు

మణుగూరుటౌన్: కేంద్రంలో బీజేపీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు తెలియజేయడం కోసం ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమాన్ని సోమవారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పున్నం బిక్షపతి, ఈసాల వెంకటేశ్వర్లు, రమేష్‌లు మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, రైతులకు ఎరువుల మీద ఇస్తున్న సబ్సిడీలు గురించి తెలియజేశారు. అధికారులు మణుగూరు మున్సిపాలిటీకి నిధుల వరద అంటున్నారని, కానీ మున్సిపాలిటీలో ఉన్న కమలాపురంలో ఎటువంటి అభివృద్ధి జరగడంలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ముత్యాల వెంకటేశ్వర్లు, నారాయణమూర్తి, రమేష్, రేణుక, సుధాకర్‌లు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

దమ్మపేట: మండల కేంద్రంలో ఉన్న అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గం, స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం దమ్మపేట గ్రామంలోని శివాలయ నూతన కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా దారా రమేష్, సభ్యులుగా పానుగంటి చిట్టిబాబు, ఊయ్యాల లక్ష్మీనారాయణ, బండ్ల లక్ష్మయ్య తదితరులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే ముందుగా స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సమక్షంలోనే, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. జెడ్పీటీసీ సభ్యులు పైడి వెంకటేశ్వరరావు, స్థానిక ప్రజా ప్రతినిధులు దారా యుగంధర్, దారా మల్లికార్జునరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, అత్తులూరి వెంకటరామారావు, యార్లగడ్డ బాబు, అబ్దుల్ జిన్నా తదితరులు పాల్గొన్నారు.

అదానిని తక్షణమే అరెస్ట్ చేయాలి



అశ్వాపురం: ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ శ్రేణులు



దమ్మపేట: ఎస్‌బీఐ ఎదుట నిరసన..

అశ్వాపురం: లక్షల కోట్ల రూపాయల ప్రజాధనంతో దేశ సంపదను కొల్లగొట్టిన ఆర్థిక నేరగాడు గౌతమ్ అదానిని తక్షణమే అరెస్ట్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య డిమాండ్ చేశారు. జాయింట్ పార్లమెంట్ ప్రత్యేక కమిటీ వేసి ఆదాని ఆర్థిక వ్యవహారాలపై విచారణ జరిపించాలని సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సరెడ్డి పుల్లారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి అనంతనేని సురేష్, సహాయ కార్యదర్శులు వేల్పుల మల్లికార్జున్, కొండపర్తి ప్రసాద్, అమెర్ద సర్పంచ్ బండ్ల సీతమ్మ, మున్నా లక్ష్మీకుమారి, సురేందర్‌రెడ్డి, రాయపూడి రాజేష్, పవన్‌సాయి, కమటం వీరన్న, ఎడెల్లి కమలాకర్, దండి నాగేశ్వరరావు, ముత్తబోయిన వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దమ్మపేట: ప్రభుత్వ రంగ సంస్థలను మోసం చేసిన కార్పొరేట్ దిగ్గజం అదానీపై పార్లమెంటు స్థాయిలో విచారణ కమిటీ వేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా, ప్రదర్శన నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ.. కార్పొరేట్ దిగ్గజం అదానీ మోసాలను కేంద్ర ప్రభుత్వం వెనకేసుకు రావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్రం తక్షణమే అదానీ అక్రమాలపై కమిటీ వేసి తగు విచారణ జరపాలని పేర్కొన్నారు. బ్యాంకుల నుంచి భారీ మొత్తంలో రుణాలు పొంది, ఎగవేతకు పాల్పడిన కార్పొరేట్ కంపెనీలపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఎస్‌బీఐ, ఎల్ఐసీ సంస్థలు మనుగడలో ఉండేలా ప్రభుత్వం తోడ్పాటును అందించాలని కోరారు. నాయకులు తంగెళ్లమూడి శివకృష్ణ, ధర్మ, సాయి, జానీబేగం, నాగమణి, శాంతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

రహదారి వెంబడి చెత్త



ప్రభుత్వం పల్లెలు పరిశుభ్రంగా ఉంచాలనే ధ్యేయంతో ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డ్‌లను లక్షల రూపాయాలు వెచ్చించి నిర్మించింది. గ్రామంలో ప్రతి ఇంటికీ ట్రాక్టర్ ద్వారా చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌లలో పోసి తడి, పొడి చెత్త వేరు చేయాలి. కానీ అధికారుల నిర్లక్ష్యంతో అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం గ్రామంలోని చెత్తాచెదారం అంతా గ్రామ శివారులోని రహదారి వెంట పోస్తున్నారు. ఈ చెత్తా చెదారంలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండడం వాటిని పశువులు తిని మృత్యువాత పడుతున్నాయి. పంచాయతీకి సంబంధించిన అధికారులు స్పందించి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- అన్నపురెడ్డిపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: రేవతి, ఎంపీడీఓ, అన్నపురెడ్డిపల్లి
ఫోన్ నంబర్: 9642621309